ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 8 డిసెంబరు 2024



బాపట్ల క్రీడా వికాస కేంద్రంలో టగ్గాఫ్ వార్ పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు



చంద్రబాబుతో మంత్రి లోకేశ్

సర్...సర్ అంటూ లోకేశ్

లకేశ్ తండ్రి చంద్రబాబు. కానీ ప్రభుత్వ కార్యక్రమంలో చంద్రబాబును తండ్రిలా కాకుండా ముఖ్యమంత్రిలాగానే లోకేశ్ గౌరవించారు. పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ శాఖ మంత్రి అయిన లోకేశ్‌ను వివరాలు అడగడం.. వాటికి లోకేశ్ సర్.. సర్.. అంటూ సమాధానాలు చెప్పారు. వేదికపై కూడా సీఎం పలు సూచనలను మంత్రికి ఇవ్వడం ఆయన వినమ్రంగా అలాగే సర్ అనడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తిగా గమనించారు. విద్యా సంబంధమైనది కార్యక్రమం కావడం సదరు శాఖ మంత్రిగా లోకేశ్ ఆహ్వానం మేరకు హాజరుకాగా, ప్రభుత్వ పెద్దగా ముఖ్యమంత్రి ఈ మీట్‌లో పాల్గొన్నారు.



పేరెంట్-టీచర్ మీట్‌కు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

నిరాడంబరంగా.. బడి సంబరం

- బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా చదువుల పండుగ
- హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్
- బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో పెండింగ్‌లోని నిర్మాణాలకు హామీ
- డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం అంటూ ముఖ్యమంత్రి పిలుపు
- అందరూ బాధ్యతతో ఉంటే విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటేనన్న బాబు



విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న చంద్రబాబు, లోకేశ్



ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బడి పండుగ.. నిరాడంబరంగా, ఆసక్తికరంగా, విద్యార్థుల ను ఉత్సాహపరుస్తూ, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సూచనల మధ్య సాగింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా శ్రీకారం చుట్టారు. నేతల హడావుడి లేకుండా.. హంగు ఆర్భాటాలకు తావులేకుండా.. అధికరదర్పం కాన రాకుండా.. కేవలం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల భవిష్యత్ బంగారుబాట కావాలంటే అందరూ బాధ్యత గా ఉంటేనే సాధ్యపడుతుందని ఈ మీట్ ద్వారా సందే శమిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రి లోకేశ్ దాదాపు మూడు గంటలపాటు విద్యార్థులు, తల్లి దండ్రులు, టీచర్ల మధ్య గడిపారు. విద్యావ్యవస్థలో ఉన్న లోపాలు సవరించుకోవడం కోసం అర్థవంతమైన చర్చకు ఈ సమావేశం ఆస్కారమిచ్చింది. హైస్కూల్ లోని తరగతి గదుల్లోకి వెళ్లి నేరుగా విద్యార్థులను వారి తల్లిదండ్రులతో మాట్లాడిన ముఖ్యమంత్రి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కూడా వివిధ అంశాలపై ప్రశ్నించారు. ఆ తర్వాత ముగ్గుల పోటీలను స్వయంగా లోకేశ్‌తో కలిసి పరిశీలించారు. ముగ్గులు బాగున్నాయంటూ మహిళలను ప్రశంసించారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఉన్న ముగ్గును పరిశీలించిన లోకేశ్ ఇదిముఖ్యమని వ్యాఖ్యా నించడంతో అక్కడ నవ్వులు విరబూశాయి. అనంతరం వేదిక వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ఓ విద్యార్థి ఇచ్చిన సందేశం ముఖ్యమంత్రి చేత చప్పట్లు కొట్టించడంతో పాటు అందరూ డ్రగ్స్ వద్దు బ్రో అంటూ శృతి కలిపారు. సైబర్ మోసాల గురించి ఓ విద్యార్థిని చేసిన ప్రసంగం కూడా ఆలోచింప చేసింది. విద్యార్థులతో కలిసి చంద్రబాబు, లోకేశ్ నేలపైనే కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు.

పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్‌పై యుద్ధం

రాష్ట్రంలో డ్రగ్స్ అనే మాటే ఎక్కడా వినపడకూడదని చంద్రబాబు అన్నారు. పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్ మీద యుద్ధం ప్రారంభం కావాలన్నారు. గంజాయిని కొంతమంది పెరట్లో కూరగాయ మొక్కల్లా పండిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలిస్తామని తెలిపారు. నిరంతరం నేర్చుకోవడం ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందంజలో ఉండాలని విద్యార్థులకు సూచించారు. రాబోయే రోజుల్లో అన్ని పాఠశాలల్లో హెల్త్ కార్డులు, ప్రోగ్రెస్ కార్డులతో పాటు విద్యార్థుల అటెండెన్స్ సమాచారాన్ని ఫోన్ల ద్వారా తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. పిల్లలు స్మార్ట్ ఫోన్లకు బానిసలు కాకుండా జాగ్రత్తగా ఉండాలని వీటి విషయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ కీలకమన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని వసతులతో తీర్చిదిద్దుతామని సీఎం హామీ ఇచ్చారు

చంద్రబాబు సూచనలు

- పిల్లల భవిష్యత్ బంగారు మయం కావాలంటే తల్లిదండుల్ర పాత్ర కీలకం. ఇందులో తల్లి పాత్ర మరింత ఎక్కువ. చిన్నప్పుడు నాకు చదువు చెప్పిన టీచర్‌ను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. ఇదే మన సంస్కృతి గొప్పదనం.
- పిల్లల చదువునే తల్లిదండ్రులు ఆస్తిగా భావించాలి. పిల్లల భవిష్యత్ గురించి తల్లిదండ్రులు కలిసి కూర్చొని మాట్లాడుకుంటూ ఉండాలి.
- పిల్లలు విచ్చలవిడిగా సెల్‌ఫోన్ వాడకం శ్రేయస్కరం కాదు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఎక్కువగా బాధ్యత తీసుకోవాలి.
- డ్రగ్ కోరల్లో నుంచి పిల్లలను కాపాడుకోవాలి. స్కూల్‌లో టీచర్లు, ఇంటి దగ్గర తల్లిదండ్రులు పిల్లల కదలికలను డేగకన్నుతో గమనిస్తూ ఉండాలి. అప్పుడే వారికి భద్రమైన భవిష్యత్ అందించగలం.
- పిల్లలు ఎవరు ఏదీ చెబితే దానని నమ్ముతారు. వారిని అనునిత్యం కాపాడుకుంటూ ఉండాలి.

పేరెంట్ టీచర్ మీట్ ఓ చరిత్ర..

పేరెంట్ టీచర్ మీటింగ్‌లు ఓ చరిత్రగా నిలిచిపోతాయని మంత్రి లోకేశ్ అన్నారు. ఈ సమావేశం ద్వారా పాఠశాలలో ఉన్న సమస్యలు తెలుస్తాయని, పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులకు సమాచారం వెళుతుందన్నారు. తమ ప్రభుత్వానికి రంగుల పిచ్చి లేదని, తాను మంత్రిని అయిన వెంటనే రంగులు తీసేయమని ఆదేశాలను జారీ చేశానని గుర్తు చేశారు. స్కూల్స్ లో జాబ్ మేళాలు తప్ప మరే ఇతర సంబంధం లేని కార్యక్రమాలు నిర్వహించకుండా చర్యలు చేపడతామన్నారు. 1 నుంచి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.944 కోట్లతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్‌ను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం కింద లక్షలాది మంది విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు చదువు మాత్రమే చెప్పాలని ఇతర పనులు వేటికీ వారిని వినియోగించరాదని తెలిపారు.

ఉత్సాహ పర్చేవిధంగా పోటీలు...

విద్యార్థుల తల్లిదండ్రులను ఉత్సాహ పర్చేవిధంగా హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. చంద్రబాబు, లోకేశ్ అధికారులతో కలిసి పోటీలను తిలకించారు. క్రీడా వికాస కేంద్రంలో ఏర్పాటు చేసిన టగ్గాఫ్ వార్ పోటీలను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థుల తండ్రులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి, లోకేశ్‌లు తాడు లాగారు. కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, విద్యాశాఖ చీఫ్ సెక్రటరి కోన శశిధర్, కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదిలో చంద్రబాబు, లోకేశ్, ఎంపీ తెన్నేటి



ప్రోగ్రెస్ కార్డు పరిశీలిస్తూ విద్యార్థిని, తండ్రితో మాట్లాడుతున్న చంద్రబాబు

సీఆర్‌డీఏ ఆఫీసుకు ఆప్షన్ నెంబర్ 4
ఆ డిజైన్‌కు ఓటు వేసిన వారు 3354 మంది

ఆత్మీయంగా.. ఆరా
- విద్యార్థులతో సరదాగా సీఎం చంద్రబాబు
- బాపట్ల మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి ముఖాముఖి

8

నాలెడ్జ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్
ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తాం: మంత్రి అనగాని

17న ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవం
- హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అందుబాటులో పట్టభద్రుల ఎమ్మెల్సీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు

టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం
- టెక్ కంపెనీల్లో యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు
- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

6

అమరావతిలో పర్యటించిన యూపీ ఉపముఖ్యమంత్రి



అమరేశ్వరాలయంలో ఉపముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) అమరావతిలో ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య శనివారం మధ్యాహ్నం పర్యటించారు. ముందుగా అమరేశ్వరస్వామి ఆలయం సందర్శించగా ఆలయ మర్యాదలతో అర్చకులు, ఈవో సునీల్‌కుమార్ స్వాగతం పలికారు. ఉపముఖ్యమంత్రి పేరుమీద స్వామివార్లకు పూజలు నిర్వహించి ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు. ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పురావస్తు ప్రదర్శన శాల, సందర్శించారు. బీజేపీ నాయకులు పాతూరి నాగభూషణం, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 585.40 అడుగులు ఉంది. ఇది 298.58 టీఎంసీలకు సమానం. ఔట్‌ఫ్లో వాటర్ 32,244 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

నాలెడ్జ్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తాం
- ఎంపీటీఎంల నిర్వహణ ప్రపంచంలోనే ఒక చరిత్ర
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని



చెరుకుపల్లి జడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, చెరుకుపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ హబ్‌గామార్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, కావూరు గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(ఎంపీటీఎం) నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి ఇరవై లక్షల మంది విద్యార్థులతో 42,303 పాఠశాలల్లో ఎంపీటీఎం నిర్వహించటం భారతదేశంలోనే కాదనీ, ప్రపంచంలోనే పెద్ద చరిత్ర అని అన్నారు. చదువంటే కేవలం పుస్తకాలకే కాదని ఆటలు, పాటలు ఇంకా బహుముఖ రంగాల్లో రాణించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంగ్లిషు మీడియం వివిధ సిలబస్‌ల పేరుతో విద్యార్థులపై మోయలేని భారాన్ని మోపిందన్నారు. దీనివలన 10వ తరగతిలో అన్ని స్కూల్స్‌ల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే విద్యార్థులే రేపటి భవిష్యత్తు అని గ్రహించిన నారా లోకేష్ గాడి తప్పిన విద్యావ్యవస్థను దారిలో పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అన్నింటికీ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆ విభాగంలో ఫైవ్‌స్టార్ తెచ్చుకుంటామని చెప్పారు. అనంతరం కావూరులోని బాలికల గురుకుల పాఠశాల సమావేశంలో పాల్గొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తామని హామీనిచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దే విషయంలో అలసత్వం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లాజర్, నవీన్ తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో మహబూబ్ సుభాని, పాఠశాల హెచ్ఎం కాటూరి లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ మెంబర్ మర్రివాడ పావని, ఎంపీటీసీ సభ్యురాలు రాణి, సర్పంచి, విద్యార్థులు పాల్గొన్నారు.

17న ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవం

- హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రథమ స్నాతకోత్సవానికి సిద్ధమౌతుంది. ఈ నెల 17వ తేదీన జరిగే ఎయిమ్స్ స్నాతకోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీశ్‌కుమార్, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఎయిమ్స్ ప్రవేశ మార్గం, బయటికి వెళ్లే మార్గాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాన ఆడిటోరియంను పరిశీలించి పాల్గొంటున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి అవసరమైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడీలను ముందుగానే అమర్చుకోవాలని, వాహనాల పార్కింగ్‌లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. అనంతరం ఎయిమ్స్, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటున్న ఎయిమ్స్ స్నాతకోత్సవంలో ప్రణాళికాబద్ధంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటున్నందున భద్రతా పరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. అధికారులు అందరూ సమన్వయంలో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, అకాడమీ డీన్ శ్రీమంతకుమార్ దాస్, పీఆర్వో డాక్టర్ వంశీకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్కే సిన్హా, డీసీహెచ్ ఎస్మయానా మజీదాబి, ఆర్అండ్‌బీ ఈఈ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగురాళ్ల కోసం వెళ్లి మహిళ మృతి

యడ్లపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రంగురాళ్లు ఏరుకునేందుకు వచ్చి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని కొండవీడు కొండలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం బేతపూడి గ్రామానికి చెందిన కర్నాటి నాగేంద్రం(60) అదే గ్రామానికి చెందిన పంజాల పోతురాజుతో కలసి శనివారం ఉదయం టీవీఎస్ మోపెడ్‌పై కొండవీడు కొండల వద్దకు బయలుదేరారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల వెనుక వైపున గల కొండవీడు కొండలపైకి చేరుకుని సాయంత్రం 5 గంటల వరకు రంగురాళ్లను వెతికారు. తిరిగి ఇంటికి బయలుదేరుతూ కొండ దిగువన ఉన్న సన్నటి కాలువలో నీటిని తాగేందుకు ముందుకు వంగింది. నీరు తాగుతూనే తూలి ముందుకు పడిపోయింది. పోతురాజు పడిపోయిన నాగేంద్రంను లేపాడు. అయితే అప్పటికే ఆమె చనిపోయినట్లు గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చాడు. బంధువులంతా సంఘటనా స్థలానికి చేరుకుని నల్లపాడు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు వచ్చిన నల్లపాడు పోలీసులు మృతి చెందిన ప్రాంతం యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామపరిధిలో ఉందని తెలుపడంతో యడ్లపాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న యడ్లపాడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోషల్ మీడియాలో కొండవీడు కొండల్లో రంగురాళ్లు బయటపడ్డాయన్న వీడియోలను చూసి ఆశతో రంగురాళ్లు ఏరుకునేందుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.85 వేల నగదు, బంగారు ఆభరణాల అపహరణ

యడ్లపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన యడ్లపాడు మండలం దింతెనపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అత్తోట రామారావు భార్యతో కలసి ఈ నెల 3న విజయవాడలో ఉన్న కుమారుడు వద్దకు వెళ్లారు. అయితే 6వ తేదీ సాయంత్రం ఇంటి పక్కనే నివాసం ఉంటున్న దేవరపు నాగమల్లేశ్వరరావు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి, లైట్లు కూడా వెలుగుతున్నాయి, వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి అంటూ సమాచారం ఇచ్చాడు. దీంతో కుమారుడితో కలసి గ్రామానికి వచ్చి పరిశీలించగా తలుపు తాళం పగులగొట్టి ఉండడంతోపాటు ఇంట్లోని బీరువా తెరిచి అందులోని బట్టలు, వస్తువులు చిందరవందరగా కింద పడవేసి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన జత దుద్దులు, లాకెట్ కలిగిన బంగారు చైను, చిన్న పిల్లల బ్రాస్‌లెట్, రెండు ఉంగరాలు, రూ. 85 వేల నగదు కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించారు. బాధితుని ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మేడికొండూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంటకు నీరు పెడదామని వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మరణించిన సంఘటన మండలంలోని వరగాని గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వరగాని గ్రామానికి చెందిన పులికొండ నరేంద్రరెడ్డి (32) పొలానికి నీరు పెట్టడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడి పోయాడు. దీనిని గమనించిన సమీప రైతులు బయటకు తీసినా అప్పటికే మరణించాడు. మృతునికి మూర్ఛ వ్యాధి ఉందనీ, దాని వలనే కాలువలో పడి మరణించాడని మృతుని తండ్రి సాంబిరెడ్డి ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యతోనే ప్రపంచాన్ని మార్చగలం

- నల్సార్ లా వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్
- విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం



ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రపంచాన్ని మార్చగలమని హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్ అన్నారు. శనివారం గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వితీయ స్నాతకోత్సవాన్ని వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు మాట్లాడుతూ జ్ఞానం యువతను గొప్ప వ్యక్తులుగా మారుస్తుందన్నారు. జ్ఞానం, నైపుణ్యాలను ఉపయోగించి సమాజానికి సేవ చేయాలన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2వ స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 860 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే విద్యను అభ్యసించాల్సిన అవసరం లేదనీ, 'ఎప్పుడైనా.. ఎక్కడైనా.. ఎవరికైనా..' అనే ఆలోచనతో వచ్చిందే 'డిస్టెన్స్.. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్' విధానమన్నారు. విద్య ఒక ప్రత్యేకాధికారం మాత్రమే కాకుండా సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యతను కలిగి ఉందనే విషయాన్ని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య గుర్తు చేశారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలో వివిధ రకాల బాధ్యతలు, ప్రతికూలతలను ఎదుర్కొంటూనే ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సును పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, సీడీవోఈ డైరెక్టర్లు, స్నాతకోత్సవ కన్వీనర్లు, అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అందుబాటులో పట్టభద్రుల ఎమ్మెల్సీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలననుసరించి శాసనసభ మండలిలోని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను నవంబరు 23న గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించామని గుంటూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి తరఫున షేక్ ఖాజావలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 6 వరకు వచ్చిన క్లెయిమ్‌లను విచారించి అర్హత కలిగిన అర్జీదారులను డ్రాఫ్ట్ జాబితా నందు ఓటర్లుగా చేర్చామని ఆయన పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ఓటర్ల నమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి గుంటూరు, కృష్ణా, గుంటూరు నియోజకవర్గములలోని అన్ని జిల్లాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రజలు ఆ జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలను ఫాం 7, సవరణకు ఫాం 8, ఓటు నమోదుకు ఫాం 18 నందు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు స్వీకరించేందుకు చివరి తేదీ డిసెంబరు 9 అని తెలిపారు. డిగ్రీ అర్హత కలిగి 2021 నవంబరు 1 లోపు డిగ్రీ పొంది ఓటరు లిస్టులో ఓటరుగా నమోదు కానటువంటి ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

- టెక్ కంపెనీల్లో యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు
- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ
- నల్లపాడు ఎంబీటీఎస్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి టెక్నోఫెస్ట్



వేడుకల్లో పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ

గుంటూరు(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందనీ, ఇప్పటికే టీసీఎస్, గూగూల్ వంటి కార్పొరేట్ కంపెనీలు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ముందుకు వస్తున్నాయని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ అన్నారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రాంతీయ స్థాయి టెక్‌ఫెస్ట్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మెరుగైన సాంకేతిక విద్యను అందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ప్రముఖ కంపెనీలతో ప్రత్యేక శిక్షణ అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని, కళాశాల స్థాయిలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రాణించేలా శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు. త్వరలో విశాఖ కేంద్రంగా భారీ సంఖ్యలో ఐటీ కంపెనీలో రానున్నాయని, ఇప్పటికే టీసీఎస్, గూగూల్ కంపెనీలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని మన్నవ మోహనకృష్ణ వెల్లడించారు. టెక్నోఫెస్ట్‌లో ఎంబీటీఎస్ కంప్యూటర్ విభాగం ఏర్పాటు చేసిన కర్షక మిత్ర ప్రాజెక్టు మొదటి బహుమతి, అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం డిజైనర్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఐవోటి బెస్ట్‌స్మార్ట్ బ్యాక్ ఫర్ ఉమెన్ సెఫ్టీ ప్రాజెక్టు ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయని, వచ్చే ఏడాది జనవరి 6,7,8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు మొత్తం 20 ప్రాజెక్టులు ఎంపికైయ్యాయని ప్రిన్సిపల్ టి.శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, పారిశ్రామిక వేత్తలు సామినేని కోటేశ్వరరావు, సామినేని ఫణికుమార్ పాల్గొన్నారు.

కర్ణాటకపై పట్టుబిగిస్తున్న విదర్భ



కుష్ శర్మ



అన్వే ద్రవిడ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ జట్టు లీడ్‌లో ఉంది. మూడు రోజుల ఈ మ్యాచ్‌లో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 203 పరుగులు చేయగా, కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటయింది. కర్ణాటక బ్యాటర్ అన్వే ద్రవిడ్ 57 పరుగులతో రాణించాడు. విదర్భ బౌలర్ కుష్ శర్మ 21 ఓవర్లలో 27 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన విదర్భ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి వంద పరుగులు చేసింది. కుష్ శర్మ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ రాణించి 35 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఆదివారం ఆటకు ఆఖరి రోజు కాగా, విదర్భ జట్టు ఇప్పటివరకు 125 పరుగుల లీడ్‌లో ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101.109.120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

పల్నాడు వార్తలు

నేడు తాగు నీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాగు నీటి సరఫరా ప్లాంట్ మరమ్మత్తుల కారణంగా ఆదివారం 5 నుంచి 9వ వార్డు, 11 నుంచి 14వ వార్డు, 19 నుంచి 24వ వార్డుల వరకు మంచి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మునిసిపల్ కమిషనర్ షమ్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా వార్డుల ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటి నిల్వలు చేసుకోవాలని సూచించారు.

కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్‌కు

రూ 25 వేలు అందజేత

సత్తెనపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల పట్ల స్పందించిన పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు ఎలినేడి లక్ష్మీ శ్రీనివాసరావులు రూ 25వేలు చెక్కును కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్‌కు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేతలు మీదుగా అందించారు. కన్నా లక్ష్మీనారాయణను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అచ్చంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన అచ్చంపేటలోని 52వ బూత్‌లో బూత్ కన్వీనర్ తిరువాయిపాటి ఆంజనేయులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. టీడీపీ సభ్యత్వం వల్ల ప్రమాద బీమా వర్తిస్తాయని తెలిపారు. పలు టీడీపీ కార్యక్రమాలను వివరించారు. యువగళం నాయకులు నీలయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

ముప్పాళ్ళ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం ముప్పాళ్ళ వైద్య సిబ్బందితో కలసి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో మాదల, నార్నెపాడు, సాతులూరు, చాగంటి వారిపాలెం గ్రామాల్లో క్యాంపు నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థినిలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని సేవలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రమ్మ, పాఠశాల ఇబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదం వితరణ

కారంపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ బొమ్మ సెంటరులో గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటి నిర్వాహకులు 300 మందికి అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కమిటి కన్వీనర్ భవిరిశెట్టి రామారావు మాట్లాడుతూ నాలుగు నెలలుగా దాతల సహకారంతో ఇప్పటికి 7 వేల మందికి అన్న ప్రసాదం అందజేశామన్నారు. కార్యక్రమంలో వాసవీ సేవాదళ్ మహిళా కమిటి ప్రధాన కార్యదర్శి చిన్ని లక్ష్మీ, ట్రెజరర్ మాడిశెట్టి పుష్పలత, భవిరిశెట్టి సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ, సాంఘీక శాస్త్ర

దినోత్సవాలు

దుర్గి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గి జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం భారత రాజ్యాంగ, సాంఘీక శాస్త్ర దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. హెచ్‌ఎం పీ కోటేశ్వరమ్మ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాంఘీక శాస్త్ర ప్రాజెక్టును ప్రదర్శనగా ఉంచారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బెంజిమెన్, ఉపాధ్యాయులు విజయరాణి, రమాదేవి, మల్లికార్జునరావు, హనుమంతురావు, శివానందు, అనంతరామయ్య, రమేష్, కరీం, రవీంద్రబాబు, పీడీ ప్రసాద్, చక్రపాణి, కృష్ణయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిస్సింగ్‌పై కేసు

నకరికల్లు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన మాదం తేజ నవంబరు 22 నుంచి కన్పించటం లేదని తేజ తల్లి వెంకట లక్ష్మి శనివారం నకరికల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తేజ నవంబరు నెలలో సెలవులు నిమిత్తం కుంకలగుంటకు వచ్చాడు. 22వ తేదీ గుంటూరు కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. కళాశాలకు ఫోన్ చేసి ఆరా తీయగా కళాశాలకు రాలేదన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాచర్ల ఎస్‌ఐగా నరసింహ

మాచర్లటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ ఎస్‌ఐగా వి నరసింహ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమరావతి పోలీస్‌స్టేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ సౌందర్య రాజన్ ఐదు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది.

వేడుకగా టీచర్స్, పేరెంట్స్ మీట్

రెంటచింతల,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్ని పాఠశాల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు వేడుకగా నిర్వహించారు. పాలువాయి, తుమ్మకోట, రెంటాల జిల్లా పరిషత్ పాఠశాలలు, మిట్టగుడిపాడు కేజీబీవీ, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు వైఆర్ఎస్, సెయింట్ జోసఫ్, లూథరన్ బాలికలు, ఆర్‌సీఎం, ఎల్ఎల్ఆర్ స్కూళ్లతో పాటు మండల పరిషత్ ఎలిమెంటరీ/ప్రాథమికోన్నత పాఠశాల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని కోలాహలంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు, పాలువాయి సర్పంచ్ మందలపు విజయలక్ష్మి ఉపాధ్యాయులు టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పాలువాయి జడ్పీ స్కూలుకి లక్ష విరాళం..

పాలువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మద్దిరాల రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివ ప్రసాద్‌రెడ్డి లక్ష రూపాయలు విరాళంగా ప్రకటించారని సర్పంచ్ మందలపు విజయలక్ష్మి తెలిపారు.

ప్రభుత్వ విద్యకు పెద్దపీట

- పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి
- తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



పట్టణంలో బాలురోన్నత స్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఏడోమైలు గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలలో గతేడాది 10వ తరగతి ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమన్నారు. ఈ యేడాది కూడా 98 శాతం ఉత్తీర్ణత సాధిస్తే ఉపాధ్యాయులకు రూ.1.50 లక్షల నగదు బహుమతిగా అందిస్తానన్నారు. అనంతరం పాఠశాలల మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో అల్లి సురేష్, హెచ్‌ఎం దుర్గా భవాని, ఎస్ఎంసీ చైర్మన్ కే.అనిత, టీడీపీ నేతలు పంగులూరి పుల్లయ్య, గుండాల శ్రీనివాస్ యాదవ్, మాజీ జడ్పీటీసీ గోపిరెడ్డి, శ్రీనివాసరావు, గంటా ధనుంజయరావు, వజ్రం నాయక్, సైదారావు, సాంబశివరావు, గోపిరెడ్డి, వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత, బాలికోన్నత పాఠశాలల్లో ..

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత, బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఎంఈవో అల్లి సురేష్, హెచ్‌ఎంలు రామారావు, షకీనా, విశ్రాంత డీవైఈవో గాదె రామకృష్ణారావు, విద్యా కమిటి చైర్మన్ ఉప్పుతోళ్ల దుర్గమల్లీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని వీరభద్రాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, చెన్నకేశవ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కెమెర దుర్గారావులు పాల్గొన్నారు.

కష్టపడండి.. కలలు సాకారం చేసుకోండి

- తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



దాచేపల్లి జడ్పీ హైస్కూల్లో కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా

పిడుగురాళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదవాలని, కలలను సాకారం చేసుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచించారు. శనివారం పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌ల హయాంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగుపడనున్నదని, రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధికి లోకేశ్ తీవ్రంగా కృషిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేనిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో సీఐ వెంకట్రావు, హెచ్‌ఎం హనుమంత్‌శాస్త్రి, పాఠశాల స్థలదాత యక్కల సుబ్బారావు, డాక్టర్ నాగిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి మోడల్ స్కూల్, జడ్పీ పాఠశాలలో...

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మోడల్ స్కూల్, జడ్పీ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ చిన్నారుల భావితరాల భవిష్యత్ బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఒత్తిడితో కూడిన విద్య వద్దని, ఇష్టంతో చదువుకోవాలన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరు చదువుకి దూరం కాకూడదని అన్నారు. దాచేపల్లి జడ్పీ పాఠశాలకు ప్రహరీ, మధ్యాహ్న భోజన పథకం గదికి నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే యరపతినేని హామీనిచ్చారు.

జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ మెరుగుపడుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో పేదవర్గాల పిల్లలే కాకుండా అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు చదివేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. మెరుగైన ఫలితాలతో కూడిన ఫలితాలు వచ్చేలా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌లు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు పినాకపాణి, కాంతారావు, దాచేపల్లి కమిషనర్ అప్పారావు, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దారు వైవీ కుటుంబరావు, సబూఖ భాస్కరరావు, కర్నాటి వరలక్ష్మీ, బెల్లంకొండ భద్రి, వినోద్‌రెడ్డి, శ్రీనివాసరావు, భాస్కరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఓ మైలురాయి

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- సత్తెనపల్లి, నందిగామ పాఠశాలల్లో కార్యక్రమానికి హాజరు



సుగాలీ కాలనీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో మనబడి కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహణ ఒక మైలురాయి అని, తద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య ధృడమైన బంధం ఏర్పరచటానికి ఈసమావేశం దోహదపడుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ అన్నారు. శనివారం సత్తెనపల్లి పట్టణం సుగాలీ కాలనీలోని హైస్కూల్, మండలంలోని నందిగామ గ్రామంలోని పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశంలో కన్నా పాల్గొన్నారు. ఆయాసమావేశాల్లో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాభివృద్ధిలో సమాజం కీలక భాగస్వామ్యం కావాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా విద్యా రంగంలో అనేక సంస్కరణలను ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా పాఠశాలలను బాగు చేసుకుందామన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచటానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో పాఠశాలల అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ మాజీచైర్మన్ ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నూర్ బాషా జాన్‌బాబు, కరిముల్లా, ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

ముందుగా 'మనబడి' బ్రోచర్లను ఆవిష్కరించారు. కాగా మండలంలోని, పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించారు. తల్లిదండ్రులకు వేర్వేరుగా క్రీడాపోటీలు నిర్వహించారు.

భక్తులకు అసౌకర్యం కలగకూడదు

- పాతపాటమ్మ అమ్మవారి 426వ తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని



తిరునాళ్ల వాల్‌పోస్టరుని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న పాతపాటమ్మ అమ్మవారి 426వ తిరునాళ్ల వేడుకలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో తిరునాళ్ల ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరునాళ్లకు వచ్చే భక్తులకు మంచినీరు, ప్రసాదాలు అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆలయంవద్ద వైద్యశిబిరం ఏర్పాటుచేయాలన్నారు. పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తన సొంత నగదు వెచ్చించి భక్తులకు మంచినీటి కోసం 30 వేల వాటర్‌బాటిళ్లు, 20వేల మందికిభోజనం ఏర్పాటుచేస్తానన్నారు. అల్లర్లు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. దైద అమరలింగేశ్వరస్వామి దేవస్థానంను కోటప్పకొండ, శ్రీశైలం మాదిరిగా రూ. 2 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం తిరునాళ్ల వాల్‌పోస్టరుని ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్, తహసీల్దార్ నగేష్, కమిషనర్ శివన్నారాయణ, ఈవో తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి

- డీఎస్పీ హనుమంతరావు
- విద్యార్థులతో 'మీతోనే మేము' కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

బెల్లంకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఏమాత్రం వాటికి అలవాటుపడినా ఇబ్బందుల పాలవుతారని డీఎస్పీ హనుమంతరావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'మీతోనే మేము' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ కొందరు విద్యార్థులు డ్రగ్స్‌కు, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ముఖ్యంగా 12 నుంచి 16 సంవత్సరాలలోపు విద్యార్థులే ఈ విధంగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా విద్యార్థులు మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సీఐ సురేష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో తనిఖీ..

బెల్లంకొండ పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ హనుమంతరావు శనివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ముందుగా 2023, 2024 సంవత్సరాలకు చెందిన పలు కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్‌ను, పరిసరాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట పెదకూరపాడు సీఐ సురేష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏఎస్ఐ బెనహరి, సిబ్బంది వెంకటేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

సాగు నీటి సంఘాలకు

రీ షెడ్యూల్

సత్తెనపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వాహణకు ప్రభుత్వం ఎట్టకేలకు తేదీలు ఖరారు చేసింది. ఇప్పటికే మూడు సార్లు ఈ ఎన్నికల నిర్వాహణకు తేదీలను ప్రకటిస్తూ పలు కారణాలతో ప్రక్రియను వాయిదా వేసింది. వరుస తుఫాన్‌లు, అల్పపీడనం కారణంగా ఈనెల 5న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. ఈనెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్టు రీషెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. సాగు నీటి సంఘాల ప్రాదేశిక నియోజక వర్గాలకు 14వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 20న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు జరగనున్నాయి. సభ్యులు చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకుంటారు. కొంత మంది కోరుకుంటే రహస్యంగా ఓటు వినియోగించుకొనేలా ఈ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తారు. సత్తెనపల్లి మండలంలో అబ్బూరులో రెండు, భట్లూరులో ఒకటి, భీమవరంలో రెండు, బృగుబండలో ఐదు, ధూళిపాళ్ళలో రెండు, గోరంట్లలో మూడు, గుడిపూడిలో నాలుగు, కంకణాలపల్లిలో మూడు, కంటెపూడిలో ఒకటి, కట్టమూరులో రెండు, కొమెరపూడిలో ఒకటి, ఎల్ గార్లపాడులో రెండు, నందిగామలో మూడు, పాకాలపాడులో నాలుగు, పెద మక్కెనలో మూడు, ఫణిదంలో మూడు, రెంటపాళ్ళలో ఒకటి, సత్తెనపల్లిలో రెండు, వడ్డవల్లిలో మూడు, సాగు నీటి సంఘాలకు, మొత్తం 154 డీసీలకు ఎన్నికలు జరగనున్నాయి.

పశుగణన పక్కాగా చేపట్టండి

రెంటచింతల,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశుగణన కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని గురజాల పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు కోరారు.శనివారం రెంటచింతల పశువైద్య శాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 25 గోకులం షెడ్లు మంజూరయ్యాయని నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ బషీర్ తదితరులు ఉన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి

రెంటచింతల,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడి నరసరావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గొడుపు ఈశ్వరమ్మ (80) శనివారం వేకువ జామున మృతి చెందినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. ఈనెల 2న పాలువాయి గ్రామంలో ధాన్యం లోడ్‌కు వస్తున్న లారీ రివర్స్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆమె కుమారుడు జీ.వినాయకరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి

ఎమ్మెల్యే ప్రవీణ్ సంతాపం

క్రోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాలెమర్రు మాజీ సర్పంచ్ ముసులూరి కోటేశ్వరంావు మృతి చెందటంతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. మాజీ సర్పంచ్ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం బాలెమర్రు గ్రామానికి వెళ్ళి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో టీడీపీ నేతలు వెంకటరామిరెడ్డి, కాంద్రు కాశయ్య, నలజాల కోటేశ్వరరావు, నలజాల సదాశివరావు, బండారు మైసూర్ బాబు తదితరులు ఉన్నారు.



మోడల్ స్కూల్లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం క్రోసూరులోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, వారికి లక్ష్యాలు నిర్దేశించి, ఆ వైపుగా ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రులు కనీసం నెలకు ఒకసారైనా పాఠశాలలకు వచ్చి విద్యార్థుల పురోగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వినూత్న మైన ఆలోచనల నుంచి పుట్టుకు వచ్చిందే మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. అందుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సూజన్‌ఎంపీపీ కోటయ్య, జడ్పీటీసీ జెమీల, ఇన్‌చార్జి తహసీల్దారు శ్రీనివాస యాదవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, క్రోసూరు సర్పంచ్ చందమామ, ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, మోడల్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ షేక్ మహమ్మద్ రఫీ, ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివ రావు, గణేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి, బండారు మైసూర్‌బాబు పాల్గొన్నారు.

క్రోసూరు మోడల్ స్కూల్ సమస్యల పరిష్కారానికి కృషి ..

క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. పది రోజుల్లో దొడ్లేరు ప్రధాన రహదారి నుంచి మోడల్ స్కూల్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ఆ రహదారిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఆట స్థలం అభివృద్ధికి, ఆర్టీసీ సర్వీసు ఏర్పాటుకి కృషి చేస్తానన్నారు.



నకరికల్లు కేజీబీవీలో 'డ్రగ్స్‌కి నో చెప్పండి'పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ చల్లా సురేష్

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

నకరికల్లు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ చల్లా సురేష్ ఆకాంక్షించారు. శనివారం నకరికల్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించే 'డ్రగ్స్‌కు నో చెప్పండి' అనే పోస్టర్‌ను ఆవిష్కరింప చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ.మణికంఠ, డాక్టర్ ఎస్‌కే హసీనా, ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మి, న్యాయవాది షేక్ అలీ బాషా, గుజ్జుల శకుంతల, పల్లా చంద్రిక, ఈవోఆర్‌డీ శివ ప్రసాదు, పలువురు పాల్గొన్నారు. నకరికల్లు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మేదరమెట్లస్వామి, షేక్‌ఖలీల్, చిన్ని ప్రసన్నాంజనేయులు, మేడం రామచౌడారెడ్డి పాల్గొన్నారు. దేచవరం మోడల్ స్కూల్లో డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఎంఈవో ఎంఎల్ఎస్ ప్రసాదు, కుంకల గుంట హైస్కూల్లో హెచ్‌ఎం మేరీరాణి, జెడ్పీటీసీ సభ్యుడు జే.హరీష్, పాల్గొన్నారు.

వివిధ స్కూళ్లలో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు

అచ్చంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పాఠశాల్లో శనివారం పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశాలను ఘనంగా నిర్వహించారు. అచ్చంపేటలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికిముఖ్య అతిథిగా కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల కమిటీ చైర్మన్ మందా క్రీస్తురాజు, పాఠశాల ఎస్‌వో కీర్తి జోత్స్న, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు. మండలంలో 62 పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు జరిగాయి.

అమరావతి, (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలంలోని ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, పాఠశాల చైర్మన్ కొండవీటి రబ్బానీ, వైస్ సర్పంచ్ కొండవీటి రజాక్, ఎంఈవో బాల సుందరరావు త దితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వపాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, ఎంపీడీవో సత్యానారాయణ, ఎంఈవో మల్లికార్జునశర్మ, నరసింహారావు, సీఐ సుబ్బారావు, ఎస్ వేణుగోపాల్, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహించారు. పల్లెగుంత ఏపీ మోడల్ స్కూల్‌లో గురజాల స్పెషల్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యాన సీఐ భాస్కర్, ఎస్ వినోద్‌కుమార్‌లు డ్రగ్స్ వలన కలిగే అనార్థాలను విద్యార్థులకు వివరించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి భోజనం చేశారు. మండలంలోని మాడుగుల హైస్కూల్‌లో ఆర్డీవో మురళి పాల్గొన్నారు. గురజాల హైస్కూల్‌లో మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ, తేలుకుట్ల జడ్పీహెచ్‌ఎస్‌లో తహసీల్దార్ నగేష్, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎంపీడీవో గౌసియాబేగంలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, తుమ్మలచెరువు పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో పట్టణ సీఐ కే. వెంకట్రావు పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత ప్రాంతంగా పిడుగురాళ్లకు గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. సమావేశంలో ఎస్‌ఐలు మోహన్, శివనాగరాజు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్‌డీ వెంగళరావు, ఎంఈవో శ్రీధర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి మధ్యాహ్న భోజనంచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంత శివ, ఎస్ఎంసీ చైర్మన్ బాలునాయక్, సర్పంచ్ సరస్వతి బాలునాయక్ పాల్గొన్నారు. ఏపీ మోడల్ స్కూల్లో కార్యక్రమానికి స్పెషలాఫీసర్ సిద్ధలింగమూర్తి హాజరై మనబడి మాస పత్రికను ఆవిష్కరించారు. ఒప్పిచర్ల హైస్కూలు, పెదకొదమగుండ్లలోని పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాది జడ్పీహైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల జోలికివెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన విద్యార్థులకు సూచించారు.సమావేశంలో స్పెషలాఫీసర్ జగదీష్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, దళిత బహుజన బీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ నాగులు, టీడీపీ నేత గుజ్జుల పాపిరెడ్డి పాల్గొన్నారు.

- విద్యార్థులతో సరదాగా సీఎం చంద్రబాబు
- ప్రతి అంశంపై స్పందించి పరిష్కారంపై స్పష్టత
- విద్యార్థులు ఆడుతూ పాడుతూ చదువుకోవాలని సూచన
- పిల్లల చదువు, వారి గోల్ తల్లిదండ్రులు తెలుసుకోవాలి
- విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మమేకం
- బాపట్ల మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి ముఖాముఖి



వేదికపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో ఉపాధ్యాయులు

ఆత్మీయంగా ఆరా



బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల లక్ష్య మేంటో అడిగారు.. తండ్రుల ఆర్థిక పరిస్థితి తెలుసు కున్నారు.. విద్యార్థులకు వచ్చిన మార్కులపై ఆరా తీశా రు.. పిల్లల చదువునే ఆస్తిగా భావించాలని తల్లిదండ్రు లకు సూచన.. విద్యార్థుల భవిష్యత్తు మీ చేతిలోనే ఉందంటూ టీచర్లకు దిశానిర్దేశం.. బాపట్ల ఉన్నత పాఠశా లలో శనివారం జరిగిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖ్య మంత్రి చంద్రబాబు అధికార దర్పం లేకుండా ఆత్మీ యంగా కలిసిపోయి వివిధ అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో సీఎం మెలి గిన తీరు ఇంటి పెద్దను తలపించడంతో పాటు సొంత మనిషి తమ దగ్గరకు వచ్చి ఇబ్బందులు వింటున్నారన్న అభిప్రాయం వారిలో కనిపిం చింది. సెల్‌ఫోన్, డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించడంతో పాటు వాటి నుంచి పిల్లల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని సీఎం తెలిపారు. మొత్తంమీద ఆసక్తికరంగా.. దిశానిర్దేశం చేస్తూ ము ఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు విద్యార్థులు, వారి తల్లులతో ముఖాము ఖీగా మాట్లాడారు. డ్రగ్స్‌కు దూరంగా ఉందాం బ్రో... అంటూ విద్యార్థి జాన్‌ప్రకాష్ మాట్లాడిన తీరుకు ముఖ్యమంత్రి విశే షంగా స్పందించారు. ఇలా విద్యార్థులు చెప్పిన ప్రతి మాటకు ఎంతో ఓర్పుతో స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చారు.



పేరెంట్-టీచర్ మీటింగ్‌లో తల్లిదండ్రులు, విద్యార్థులు

పూర్వవిద్యార్థి, విశ్రాం త ఆచార్యులు డాక్టర్ పీవీ కృష్ణయ్య: బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో అనేక మంది ప్రముఖులు విద్యనభ్యసించారు. ఇక్కడ చదివి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అసోసియేట్ డీన్‌గా పనిచేశాను.

ముఖ్యమంత్రి: అనేకమంది ఉన్నత స్థాయికి ఎదగడానికి విలువలతో కూడిన విద్యను అందుకో వడమే ప్రధానం. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాను.

విద్యార్థిని షేక్.భాను: మా పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ లేవు. వాటిని ఏర్పాటు చేయాలి.

ముఖ్యమంత్రి: హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ ఏర్పాటుకు ఎంపీ తెన్నేటి కృష్ణప్ర సాద్ కృషి చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశా లలో వీటిని ఏర్పాటు చేసే బాధ్యత మంత్రి నారా లోకేశ్ తీసుకుంటారు.

విద్యార్థి పి.సంతోష్: పాఠశాలలో క్రీడలకు సం బంధించిన గ్రౌండ్ అభివృద్ధి చేసి ఇండోర్ స్టేడి యంలో షటిల్ ఆడుకునే అవకాశం కల్పించాలి. క్రీడా సామగ్రి ఏర్పాటు చేయాలి.

ముఖ్యమంత్రి: పాఠశాలలో క్రీడా ప్రాంగణం అభి వృద్ధి చేస్తాం. విద్యార్థులు ఆడుతూ పాడుతూ చదువుకునే విధంగా చేస్తాం. కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటలతో కూడిన చదువు వల్ల విద్యార్థులు ఆనందంగా, ఇష్టంగా చదువుకుంటారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఎన్.హేమమా లిని: పాఠశాలలో ఏడేళ్ల క్రితం భవనం నిర్మించి పూర్తి చేయకుండా వదిలేశారు. భవనాన్ని పూర్తి చేయించి ప్రారం భించేలా ముఖ్యమంత్రి చొరవ చూపాలి. ఇక్కడ చదువుకు నే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి.

ముఖ్యమంత్రి: వచ్చే జూన్ నాటికి భవనం నిర్మాణం పూర్తి చేసి కొత్త భవనంలోనే తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు: నానాటికి మానవ సం బంధాలు తరిగిపోతున్నాయి. విద్యార్థులు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న విధానం సరిగాలేదు. పాఠ్యాంశాలలో నైతిక విలువలు పెంపొందించే పాఠాలు ఏర్పాటు చేయాలి.

ముఖ్యమంత్రి: నైతిక విలువలు చాలా ముఖ్యం. వీటిని పెంచేందుకు ప్రభుత్వం తరపున కౌన్సెలింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. వారసత్వ సంపద భవిష్యత్ తరాలకు అం దించేలా కృషి చేస్తాం. కెరీర్ గైడెన్స్‌పై చాగంటి కోటేశ్వరరావు ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తాం.

సెల్‌ఫోన్‌తో నష్టం

విద్యార్థిని పి.జోత్స్న: సెల్‌ఫోన్ల వినియోగం వల్ల విద్యార్థులు అనేక విధాలుగా నష్టపోతు న్నారు. దీనివల్ల చదువులో వెనుకబడిపోతున్నారు. సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లకు దూరంగా ఉంటూ చదు వుపై శ్రద్ధపెడితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు.



సీఎం చంద్రబాబు: నేడు సమాజంలో సైబర్ నేరాలు పెద్ద సవాల్‌గా మారాయి. దీనిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. విద్యార్థులు సాధ్యమైనంత వ రకు సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌ల వినియోగాన్ని తగ్గించాలి. దీనికి తల్లిదండ్రుల సహకారం కూడా అవసరం.

ఉపాధి కోర్సులు కావాలి

విద్యార్థి అఖిల్ తల్లి కూచిపూడి ఝాన్సీరాణి: పాఠశాలలో ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులు ఏర్పాటు చేయాలి. కెరీర్ గైడెన్స్ ఇవ్వడం వల్ల వారికి మంచి భవిష్యత్ ఉంటుంది. పాఠశాలలో అలాంటి కా ర్యక్రమాలు నిర్వహించాలి.

ముఖ్యమంత్రి: ప్రతి ఇంటిలో ఒక పారి శ్రామికవేత్త రావాలి అలాంటి ఆలోచనలు ప్రతి ఒక్కరికి కలగాలనేది నా ఆకాంక్ష. ఆ దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం. విద్యా ర్థులతో తల్లిదండ్రులు ప్రతిరోజు మాట్లాడి వారు ఏమి చదవాలి, గోల్ ఏమిటి అనేది తెలుసుకోవాలి.



డ్రగ్స్ వద్దు బ్రో..



విద్యార్థి జాన్‌ప్రకాష్: డ్రగ్స్‌కు దూరంగా ఉందాం బ్రో. నానాటికి మత్తుపదార్థాలు వినియోగిస్తూ విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

సీఎం: ఇళ్ల దగ్గరే గంజాయి మొక్కలు పెంచే పరిస్థితి వచ్చింది. దీనిని సమూలంగా అరికట్టేందుకు ఈగల్ పేరుతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తీసుకువచ్చాం. తనిఖీలు చేపట్టి మత్తుప దార్థాలు వినియోగించకుండా, విక్రయించకుండా కట్టుదిట్టమై న చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు కూడా పిల్లలు చే సే పనులను గమనిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు వారికి కౌ న్సెలింగ్ ఇచ్చి వ్యసనాలకు దూరంగా ఉంచి భవిష్యత్‌కు ఉప యోగపడే కార్యక్రమాలు నేర్పించాలి. పిల్లల పనితీరుపై డేగ కన్ను వేయాలి. లేకుంటే వారు నిజమైన తల్లిదండ్రులు కాదు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటే తద్వారా స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధ్యమౌతుంది. అదే నా ఆకాంక్ష.

జవాన్ల కుటుంబాలకు అండగా నిలుద్దాం

- కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మనం అందించే సహాయం దేశ రక్షణలో అశువులు బాసిన వీర జవానుల కుటుంబ సంక్షేమం, పునరావాసానికి ఎంతగానో దోహద పడుతుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాల కార్య క్రమాన్ని ఆమె ప్రారంభించారు. కలెక్టర్ ప్రప్రథమ విరాళాన్ని హుండీ బాక్స్‌లో వేసి ప్రారంభించారు. డీఆర్‌ఓ ఎన్ షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావులు ఈ సందర్భంగా విరాళాలు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సైనికులు విధులను నెరవేర్చేందుకు తమ జీవితంలో ఎన్నో త్యాగాలు చేస్తారని కొనియాడారు. సరిహద్దులను రక్షించడం ద్వారా దేశ, గౌరవం, భద్రతను కాపాడిన సైనికులకు, మాతృభూమి సేవలో తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. దేశ రక్షణతో పాటు అంతర్గతంగా జరిగే అనేక విపత్కర పరిస్థితులను చక్కదిద్దడంలో సైనికులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. యుద్ధం వలన వికలాంగులైన సైనికులు, వితంతువులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం విరివిగా విరాళాలు అందించి తమ వంతు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. విరాళాలు సేకరించే ప్రక్రియలో భాగంగా రూపొందించిన ప్రచార పోస్టర్లను సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుడు హవల్దార్ పొరధి రెడ్డి(శౌర్య చక్ర) భార్య బుడ్డపు వెంకట లక్ష్మి, సిపాయి సీ వాసు కిషోర్ భార్య నవీనలను కలెక్టర్ సన్మానించారు. వెంకట లక్ష్మికి ఏటుకూరు గ్రామంలో 300 చదరపు గజాల ఇంటి స్థలం పట్టాను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారిణి ఆర్ గుణ శీల, జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకుడు ఆనంద రావు, మాజీ సైనికుల ప్రతినిధులు నరసింహులు, రామిరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- 10 డిజైన్ల ఓటింగ్‌లో పాల్గొన్న 9756 మంది
- ఆప్షన్ - 4 డిజైన్‌కు ఓటు వేసిన వారు 3354 మంది
- రెండో స్థానంలో నిలిచిన ఆప్షన్ - 10, మూడో స్థానంలో ఆప్షన్ - 8



సీఆర్‌డీఏ ఆఫీసుకు ఆప్షన్ నెంబర్ 4

తుళ్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఏపీసీఆర్‌డీఏ ప్రాజెక్టు బిల్డింగ్ డిజైన్లకు నిర్వహించిన పోలింగ్‌కు అనూహ్య స్పందన వచ్చింది. 10 డిజైన్లను ఇటీవలే వెబ్‌సైట్‌లో ఉంచి నచ్చిన డిజైన్‌ను ఎంపిక చేయాల్సిందిగా సీఆర్‌డీఏ అధికారులు ప్రజాభిప్రాయాన్ని కోరిన సంగతి తెలిసిందే. దీనికి వారం రోజులు గడువు నిర్దేశించారు. గడువు పూర్తి కావటంతో ప్రజాభిప్రాయాన్ని సీఆర్‌డీఏ అధికారులు శనివారం వెల్లడించారు. మొత్తం 9756 మంది డిజైన్ల ఎంపికలో పాల్గొన్నారు. అత్యధికంగా ఆప్షన్ - 4 డిజైన్‌కు ప్రజలు ఓటు వేశారు. ఆప్షన్ - 4 కు అత్యధికంగా 3,354 మంది ఓటు వేశారు. పోలైన మొత్తం ఓట్లలో 34.36 శాతం మేర ఆప్షన్ - 4 కే మొగ్గు చూపటం విశేషం. ఆప్షన్ - 10 డిజైన్ రెండో స్థానంలో నిలిచింది. ఆప్షన్ - 10 డిజైన్‌కు 3,279 ఓట్లు వచ్చాయి. ఆప్షన్ - 10కి కూడా దగ్గర దగ్గరగా 33.61 శాతం మేర ఓట్లు పడటం విశేషం. ఈ రెండు డిజైన్ల మధ్యన చాలా దగ్గర పోటీ నెలకొంది. ఆప్షన్ - 8 డిజైన్‌కు 1669 ఓట్లు వచ్చాయి. ఆప్షన్ - 8 మూడవ స్థానంలో నిలిచింది. ఇక వరుసగా చూస్తే నాల్గవ స్థానంలో ఆప్షన్ - 3, ఐదవ స్థానంలో ఆప్షన్ - 6, ఆరవ స్థానంలో ఆప్షన్ - 1, ఏడవ స్థానంలో ఆప్షన్ నెంబర్ - 7, ఎనిమిదవ స్థానంలో ఆప్షన్ - 9, తొమ్మిదవ స్థానంలో ఆప్షన్ - 2, పదవ స్థానంలో ఆప్షన్ - 5లు నిలిచాయి.

- రతన్‌టాటా ప్రేరణతో నానో కారులో ప్రయాణం
- తాడేపల్లికి విచ్చేసిన శాంతి యాత్రికుడు ఎస్ఎన్ సంకల్ప్

శాంతి యాత్రికుడు సంకల్ప్

తాడేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతితో ఉంటే దేశ అభివృద్ధి సాధ్యమని.. యువత, విద్యార్థులు ప్రజల్లో మార్పు కోసంగా.. రతన్‌టాటా ప్రేరణతో.. నాగపూర్‌కు చెందిన ఎస్ఎన్ సంకల్ప్ భారతయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది అక్టోబర్ 17న నాగపూర్‌లో నానో కారులో సంకల్పయాత్ర ప్రారంభం కాగా శనివారం తాడేపల్లికి చేరుకుంది. కుంచనపల్లి అరవింద హైస్కూల్ విద్యార్థులతో ముఖాముఖి అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో సంకల్ప్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలిలా ఉన్నాయి..



నానో కారుతో సంకల్ప్

యాత్ర ఎందుకంటే..

ప్రతి ఒక్కరూ శాంతితో ఉండాలని ప్రకృతిని నాశనం చేయకుండా, చెట్లను సంరక్షించాలి. కళలు, డ్రాయింగ్ ద్వారా మానవునికి కొంత ప్రశాంతత లభిస్తుంది. ధ్యానంతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుంది. ప్రతి ఒక్కరూ శాంతితో ఉంటే ఇబ్బందులు ఉండవని, మానసిక ప్రశాంతత ఉంటే ప్రతి ఒక్కరి అభివృద్ధి సాధ్యం. కోపం, అశాంతి అభివృద్ధి నిరోధకాలు. యువతకు పీస్ ఆఫ్ మైండ్ ఉండాలి. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి. విద్యార్థులకు ఫైన్‌ఆర్ట్స్ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుంది. డబ్బుతో ప్రశాంతతను కొనలేము. ఈ అంశాలపై విద్యార్థులను, ప్రజలను ప్రభావితం చేయాలనే తపనతో భారతయాత్రకు శ్రీకారం చుట్టాను. యాన్ ఆర్టిస్ట్ ట్రావెలింగ్ ఆలిండియా బై నానో కార్ ఫర్ పీస్, నేచర్, ఆర్ట్ అండ్ మెడిటేషన్ ట్యాగ్‌తో ప్రయాణం చేస్తున్నాను.

సంకల్పమిది..

మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన నేను 2009లో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. మైత్రేయి గ్లోబల్ ఆన్‌లైన్ ఆర్ట్ అకాడమీ స్థాపించి ఫైన్‌ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చాను. ఆర్టిస్ట్‌గా వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా ఆధ్యాత్మిక సలహాదారుగా, రచయితగా, ఫైన్‌ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ దేశంలో విద్యార్థులు, యువత, ప్రజలు శాంతితో ఉంటే దేశ అభివృద్ధి సాధ్యమనే భావనతో భారత్‌యాత్ర చేపట్టాను. పారిశ్రామిక దిగ్గజమైనా నిత్యం పేదలు, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసిన రతన్ టాటా ప్రేరణతో ఆయన ప్రవేశపెట్టిన నానో కారులో శాంతి కోసం మంచి ప్రకృతి ఉండాలనే లక్ష్యంతో యాత్ర చేస్తున్నాను. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, శాంతి, ప్రకృతి, ఆరోగ్యం అంశాలపై అవగాహన కల్పిస్తూ యాత్ర సాగిస్తున్నాను.

టాటా జీవితం ఆదర్శం

ప్రజలకోసం తపన పడే ఏకైక మనసున్న పారి శ్రామికవేత్త రతన్ టాటా భావాలు, వ్యక్తిత్వం, నిజాయితీతో కూడిన జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శ నీయం. అందుకే ఆయన అందుబాటులోకి తెచ్చిన నానో కారులోనే దేశాన్ని చుట్టి రావాలనే ప్రేరణ కలిగింది. ప్రయా ణంలో రహదారి పక్కన ఉన్న పాఠశా లలు, పీహెచ్‌సీలు, రెస్ట్ ఏరియా ల్లోనే కారులో విశ్రాంతి తీసుకుంటా. కారు లోనే చిన్న గ్యాస్ సిలిండర్, స్టవ్ వంటపదార్థాలు పెట్టుకుని వండుకుని భోజనం చేస్తాను.

ఫ్లెమింగ్ పక్షి స్ఫూర్తి..

యాత్రకు చైనీస్ ట్రావెలర్ జుయాంగ్ చాంగ్, శ్రీలంకకు చెందిన నయానిక్ ధర్మపాల్ మాంక్ ఆదర్శం. అమెరికా నుంచి భారత్‌కు ఫ్లెమింగ్ బర్డ్‌కు వస్తుంది. ఆ పక్షి స్ఫూర్తితో యాత్రకు శ్రీకారం చుట్టాను. ఆరు నెలల్లో యాత్ర సాగుతుందని, ముంబాయి చేరికతో ముగుస్తుంది. పెయింటింగ్‌ల విక్రయం, బోధనల ద్వారా వచ్చే నగదును ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాను.



విద్యార్థులకు బోధన చేస్తున్న సంకల్ప్

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు

ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ ఆర్ఎఫ్‌పీ గడువు పొడిగింపు

విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆ ర్)కు సంబంధించి ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ మంచి మోడల్‌ను ఇచ్చేందుకు వీలుగా ఆర్ఎఫ్‌పీ విడుదల చేసిన సీఆర్‌డీఏ అధికారులు మరోమారు దీని గడువును పెంచారు. బిడ్డర్ల నుంచి సాంకేతికపరమైన అంశాలపై సందేహాలు వ్యక్తమైన నేప థ్యంలో గడువును డిసెంబరు 20 వరకు పొడిగించారు.

తెలుగు నాటకరంగ శిల్పి కేఎస్‌టీ శాయి

ఏపీ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగ చరిత్రలో సువర్ణ అధ్యాయాలు లిఖించిన నాటకరంగ నిర్మాణ శిల్పి కేఎస్‌టీ శాయి అని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మన్ కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. చరిత్ర పరిశోధకుడు మన్నె శ్రీనివాసరావు రచించిన నవరస నాట్య కళానిధి కేఎస్‌టీ శాయి అనే గ్రంథాన్ని బాపట్ల రోటరీకల్యాణ మండపంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుమ్మడి మాట్లాడుతూ శాయి జీవిత చరిత్రను విశ్లేషణాత్మకంగా, పరిశోధనాత్మకంగా రచించడం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ మహనీయుల చరిత్ర సామాజికులకు దిశ, నిర్దేశం చేసే దీపస్తంభంలాంటిదన్నారు. చైత న్య విద్యాసంస్థల ఏజీఎమ్ ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికా సానికి లలితకళలు, నాటకకళ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క ళాకారుడు యార్లగడ్డ సత్యనారాయణ, సినీ రచయత బుర్రా సాయిమాధవ్, కొత్తపల్లి శ్రీనివాసరావు, వంకాయలపాటి హరిబాబు, డాక్టర్ రావూరి వీరరాఘవయ్య, మట్టా రాజా, వెంకటరామప్రసాద్, ఆకురాతి మురళీకృష్ణ, వై.ఎస్.కృష్ణేశ్వరరావు, అంబటి మురళీకృష్ణ, సంకా వెంకటరామ్‌కుమార్, భాగి కృష్ణమూర్తి, బందాబాబు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చెరువును పరిశీలించిన ఇరిగేషన్, టూరిజం అధికారులు

రొంపిచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల గ్రామంలోని చెరువును మైనర్ ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఈ చెరువు గురించి అసెంబ్లీలో ప్రస్తావించారు. చెరువు అభివృద్ధికి సహకరించాలని సంబంధిత శాఖ మంత్రిని కోరారు. దీంతో మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, విజయవాడ నుంచి టూరిజం డీఈ శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చి చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వీరి వెంట ఏఈ కిరణ్, కోటయ్య తదితరులు ఉన్నారు.

రెడ్డిపాలెంలో టీడీపీ జెండా ఆవిష్కరణ

రొంపిచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎమ్మెల్యే అరవిందబాబు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గయ్య, పిచ్చిరెడ్డి, సైదులురెడ్డి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడమంటే ఒకరికి ప్రాణదానం చేసినంత అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని ఏసుక్రీస్తు దివ్య శాంతి నిలయంలో నందమూరి క్రిష్టఫర్ ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రిష్టఫర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రత్తిపాటిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు నిధుల కేటాయింపు

చిలకలూరిపేట నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.36.75 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే పుల్లారావు శనివారం తెలిపారు. మురికిపూడి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి రూ.12.65 లక్షలు, పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహానికి రూ.10.75 లక్షలు, నాదెండ్లలోని సాంఘిక సంక్షేమ వసతి గృహానికి రూ.13.35 లక్షలు నిధులు కేటాయించామని, ప్రతిపాదనలు పంపిన వెంటనే బడ్జెట్ కేటాయించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి ఈ సందర్భంగా ప్రత్తిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

ఈపూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు

ఈపూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈపూరులో నర్సరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో శనివారం దాడులు చేశారు. మెయిన్‌రోడ్డు ప్రక్కన ఉన్న ప్రైవేట్ క్లినిక్‌లో తనిఖీ నిర్వహించారు. అనుమతి లేకుండా మందులున్నాయని, అవి కొన్నట్లు బిల్లులు కూడా లేకపోవడంతో డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ చట్టం ప్రకారం వాటిని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సునీత తెలిపారు. వాటి విలువ లక్షల్లో ఉంటుందని చెబుతున్నారు. తనిఖీలో గుంటూరు డ్రగ్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

మెగా పీటీఎం కార్యక్రమం

బొల్లాపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ (పీటీఎం) కార్యక్రమంలో బొల్లాపల్లి జడ్పీ హైస్కూల్లో ఎస్‌ఐ ఏ బాలకృష్ణ, ఎంఈవో పార్వతి పాల్గొన్నారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి తల్లిదండ్రులతో ముచ్చటించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

నూజెండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ శనివారం విడుదల చేశారు. నవంబరు 6వ తేదీ వరకు వచ్చిన క్లైమ్‌లను విచారించి అర్హత కలిగిన అర్జీ దారులకు డ్రాఫ్ట్ జాబితా నందు ఓటర్లుగా చేర్చామన్నారు. ప్రజలు జాబితాను పరిశీలించి అభ్యంతరాలను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను 9వ తేదీ వరకు స్వీకరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

నూజెండ్లలో రేపు ప్రజాదర్బార్

నూజెండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన నూజెండ్లలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రజాదర్బార్ కార్యక్రమం జరగనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యాదవ్ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు సమస్యల సత్వర పరిష్కారానికి వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు తెలిపారు.

మది నిండుగా.. బడి పండుగ

● కోలాహలంగా తల్లిదండ్రులు.. ఉపాధ్యాయుల మెగా సమావేశాలు
● 1586 పాఠశాలల్లో నిర్వహణ
● ఆట.. పాటలతో విద్యార్థులు.. తల్లిదండ్రుల సందడి
● మీటింగ్‌లకు హాజరైన ఎమ్మెల్యేలు
● పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు


వినుకొండలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

నరసరావుపేట, వినుకొండటౌన్, రొంపిచర్ల, చిలకలూరిపేట అర్బన్, యడ్లపాడు 7(ఆంధ్రజ్యోతి): మది నిండుగా బడి పండుగ జరిగింది. విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల బాగస్వామ్యమే లక్ష్యంగా ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించింది. జిల్లాలో కోలాహలం గా పాఠశాలల్లో సమావేశాలు శనివారం జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు.. తల్లిదండ్రులు ఆటపాటలు నృత్యాలతో సందడి చేశారు. పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. పాఠశాలల్లో తల్లిదండ్రులు.. ఉపాధ్యాయుల మధ్య సంబంధాలను బలపరిచేందుకు సమావేశాలు దోహదపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి రాబోయే 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో సమావేశాలు పండగ వాతావరణంలో జరిగాయి. విద్యార్థులు.. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలోని 1586 ఎయిడెడ్.. ప్రభుత్వ పాఠశాలల్లో 1,53,229 మంది విద్యార్థుల తల్లిదండ్రులు మీటింగ్స్‌కు హాజరయ్యారు. విద్యాశాఖ పాఠశాలలో సమావేశాలకు విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పూర్వ విద్యార్థులు, దాతలు మీటింగ్‌లలో భాగస్వాములయ్యారు.

విద్యా.. ప్రవర్తన పరంగా పిల్లలు ఏ స్థాయిలో ఉన్నారో, సమాజంపై ఏవిధమైన అవగాహన కలిగి ఉన్నారో తల్లిదండ్రులు తెలుసుకోవడానికి సమావేశాలు దోహదపడ్డాయి. పిల్లల విద్యా పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేస్తూ వారి మార్కుల పత్రాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి ఆర్‌బీఎస్‌కే కార్డులను పంపిణీ చేశారు. తల్లులకు తరగతుల వారీగా రంగోలి.. తండ్రులకు టగ్‌ఆఫ్ వార్ నిర్వహించారు. పోటీల్లో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు.. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలలో పాల్గొన్నారు. స్కూల్‌కు అవసరమైన


నరసరావుపేట మండలం జొన్నలగడ్డ స్కూల్లో పాల్గొన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

మౌళిక సదుపాయాలు, చేపట్టవలసిన కార్యాచరణ ప్రతిపాదనలతో కూడా ప్రగతి నివేదికలను రూపొందించారు. సైబర్ నేరా లపై అవగాహన కల్పించారు. స్కూల్లో చదివి ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థుల విజయ గాథలు తెలియజేశారు. స్కూల్ నిర్వహణపై తల్లిదండ్రులు, అతిథుల నుంచి స్కూల్స్ హెచ్‌ఎంల అభిప్రాయాలను సేకరించారు. ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ ద్వారా తల్లిదండ్రులు, అహ్వానితులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. అహ్వానితులు.. తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనాల అనంతరం మీటింగ్‌లు ముగిశాయి.

విద్యార్థులే రాష్ట్ర సంపద: జీవీ

విద్యార్థులే రాష్ట్ర సంపద అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఈపూరు మండలం ఇనుమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. చదువుతోపాటు క్రీడలు విద్యార్థులకు ముఖ్యమని జీవీ తెలిపారు. ప్రతి రోజు క్రీడలకు గంట సమయం స్కూళ్లలో కేటాయించాలన్నారు. క్రీడలకు అవసరమైన సామగ్రిని తాను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశాలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని చెప్పారు. తల్లిదండ్రులతో జీవీ ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి నివేదికలను ఆయన పరిశీలించారు. దివ్యాంగుల విద్యార్థులకు ట్రై సైకిళ్లను జీవీ పంపిణీ చేశారు.


చిలకలూరిపేటలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

సమావేశాల్లో ఎమ్మెల్యేలు

చిలకలూరిపేట మండలం బొప్పూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. సత్తెనపల్లి పట్టణంలోని సుగాలి స్కూల్, మండలంలోని నందిగామ స్కూల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పట్టణం. రొంపిచర్ల. నరసరావుపేట మండలంలోని స్కూళ్లలో జరిగిన సమావేశాలకు హాజరయ్యారు. క్రోసూరులోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశంలో ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్, మాచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల, మాచర్ల మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. వైసీపీ పాలనలో పాఠశాల విద్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యేలు విమర్శించారు. నాడు నేడు పథకం పేరిట పాఠశాలల్లో మౌళిక వసతులు కోసం చేపట్టిన పనులు పూర్తి చేయలేదని తెలిపారు. చివరకు సుద్దముక్క కొనుగోలుకు నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి అడుగులు వేస్తుందని, దీనిలో భాగంగా నే పేరెంట్స్ సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు.


యడ్లపాడులోని పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

ఉన్నవ స్కూల్లో విద్యార్థులతో కలెక్టర్.. ఎస్పీ ముఖాముఖి

యడ్లపాడు మండలం ఉన్నవ స్కూల్లో జరిగిన పేరెంట్స్ సమావేశంలో కలెక్టర్ పీ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యార్థులతో వారు ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల విద్యాప్రగతి పత్రాలను పరిశీలించారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు, నైపుణ్యాన్ని గుర్తించి పోత్సహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. పిల్లల భవిష్యత్తు విషయాలపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. పాఠశాలల పర్యవేక్షణలో తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకే ప్రభుత్వం పేరెంట్స్ సమావేశాలు ఏర్పాటు చేసిందన్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థా లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు కలిగి ఉన్నట్టు గుర్తిస్తే 1942కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. దాతల ఆర్థిక సాయంతో నిర్మించనున్న కళావేదిక పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వైద్యాధికారి బీ రవి, డీఈవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహ భరితంగా మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశాలు

నూజెండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం, విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ఆట పాటలతో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల స్పెషల్ అధికారి సుబ్బారావు, జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు, రామయ్య, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, ఎంఈవో నలబోలు రవిచంద్ర, సీనియర్ టీడీపీ నాయకులు వీరాంజనేయరెడ్డి, గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాఘవ, ఎస్‌ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీలు పెంచటం లేదని చెప్పటం బూటకం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే సంవత్సరం విద్యుత్ చార్జీలు పెంచడం లేదని చెప్పటం పచ్చి బూటకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. శనివారం నరసరావుపేట షాదిఖానాలో పల్నాడు జిల్లా 25వ మహాసభ రెండో రోజు జరిగాయి. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జిల పేరుతో ఇప్పటికే రూ.15,400 కోట్లు పెంచారన్నారు. చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు పేరుతో పెంచిన ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలన్నారు. అదాని అప్పటి రాష్ట్ర పభుత్వ పెద్దలకు రూ.1750 కోట్లు లంచాలు ఇచ్చారని అమోరికాలో సాక్ష్యాలతో బయటపెట్టారు. అయినా కూటమి ప్రభుత్వ పెద్దలు ఎందుకు విచారణ చేయటం లేదని, ఆ ఒప్పందాలు ఎందుకు రద్దు చేయటం లేదో చెప్పాలన్నారు. 25 ఏళ్లలో లక్ష కోట్లు బారంపడే వప్పందాన్ని రద్దు చేయాలన్నారు. పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాలు అధికార పార్టీల ప్రచార సభల్లా మారిపోయాయన్నారు. చదువు బాగా సాగాలంటే నాణ్యమైన టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. తల్లికి వందనం ఇస్తామని తేదీ ప్రకటించి అందజేయాలన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో రాష్ట్ర మహా సభలు జరుగుతాయని, ఆ సమావేశాలలో ఈ విషయాలు చర్చిస్తామన్నారు. రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధం అవుతామన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

● శివశక్తి గ్రూప్స్ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న నందిగం శ్రీనివాసరావు

వినుకొండ, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయుల నుంచి తరచూ సమాచారం తెలుసుకోవాలని శివశక్తి గ్రూప్స్ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు అన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం జడ్పీ పాఠశాల్లో జరుగుతున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లల చదువులు, ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో నందిగం సాంబశివరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ అపర్ణ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌కు విశేష స్పందన

నాదెండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ సమావేశానికి శనివారం విశేష స్పందన లభించింది. ఆయా పాఠశాలల్లో జరిగిన సమావేశానికి పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు తరలి వచ్చారు. సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎస్ ఎంసీ కమిటీ సభ్యులు హాజరయ్యారు. సెల్ ఫోన్‌లకు, ద్విచక్ర వాహనాలకు పిల్లలను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు.

రాష్ట్ర, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న నాబార్డ్

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


సభలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై జీవీ ఆంజనేయులు, మక్కెన

వినుకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, దేశాభివృద్ధిలో నాబార్డు కీలక పాత్ర పోషిస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, గ్రామ సంత ప్రాంగణాన్ని శనివారం సాయంత్రం లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు ప్రాజెక్టులకు ఎక్కడ అవసరమైతే అక్కడ రుణాలు ఇచ్చిన నాబార్డు ఇప్పుడు రైతులకు ఉపయోగపడే కూరగాయల మార్కెట్ వంటి వాటికి కూడా ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. చుట్టుప్రక్కల గ్రామాల వారు పండించిన కూరగాయలను ఇక్కడ అమ్ముకోవచ్చునన్నారు. స్థానిక నాయకులు,ప్రజల సహకారం ఉంటే నాబార్డు ద్వారా ఎన్నో అభివృద్ధి పనులు చేయించుకోవచ్చునన్నారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త నాగ శ్రీను, టీడీపీ నాయకులు వజ్రాల కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఆధారిత రుణాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఎంపీ లావు

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ ఆధారిత రుణాలను మరింతగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని, రుణాల గురించి ప్రజలకు వివరించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారుల తో అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డీఎల్‌ఆర్‌సీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడుతు 9 కేంద్ర ప్రభుత్వ బ్యాంకుల రుణాలను స్వోనో రెడ్ స్కీమ్ వివరాలను మరింత సమగ్రంగా వారం రోజుల్లో అందజేయాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే మాట్లాడుతు బ్యాంకర్స్ రుణాలను మరింత వ్యాప్తి చేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వంలోనే క్రైస్తవ మిషనరీ ఆస్తులకు రక్షణ

● ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవులు, మిషనరీ ఆస్తులకు రక్షణ అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని కళ్యాణపురి కాలనీలో క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో పాస్టర్ ఫిలిప్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి గ్రాండ్ సెమిక్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రి నుంచి వచ్చిన ముఖ్య ప్రసంగీకులు బ్లెస్సీవెస్లీ దైవసందేశాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు భక్తులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లడుతూ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటానని, ఎప్పుడు ఎలాంటి ఇబ్బంది వచ్చిన ప్రభుత్వం తరపున సహకారం చేయూతనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా, రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షుడు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోటల్ 7 ఇన్ ప్రారంభం


నూతన హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పల్నాడు రోడ్డులో నూతనంగా నిర్మించిన హోటల్ 7ఇన్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, జనసేన నాయకులు సయ్యద్ జిలాని, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, నాగసరపు సుబ్బరాయ గుప్తా, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, హోటల్ నిర్వహకులు వడ్లమూడి శివరామకృష్ణ చౌదరి, కొమ్మసాని కమలాకరరెడ్డి, డాక్టర్ గడ్డం శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎంఏఎం లా కాలేజీలో మూట్ కోర్టు హాల్ ప్రారంభం



సభకు హాజరైన ముఖ్యఅతిథి ఆలూరి రామిరెడ్డి, చైర్మన్ రామశేషగిరిరావు, ఏఎన్‌యూ వీసీ గంగాధర్‌రావు, రిజిస్ట్రార్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం లా కాలేజీలో మూట్ కోర్టు హాల్‌ను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బీసీఐ ట్రస్ట్ అండ్ మెంబరు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆలూరి రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎంఏఎం కళాశాల ఆడిటోరియంలో సభ జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, పరిశ్రమ ఉంటే విజయం మన సొంతం అవుతుందన్నారు. గౌరవ అతిథులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ గంగాధర్‌రావు, రిజిస్ట్రార్ జీ సింహాచలం, లా డిపార్టుమెంట్ డీన్ సీహెచ్ సుధాకర్‌బాబు, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడు బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ శ్రావ్య పృథ్వీరాజ్ ప్రిన్సిపాల్ వీరబ్రహ్మామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు రైతులు బాండ్లు తీసుకోవటం శ్రేయస్కరం

● జిల్లా వ్యవసాయ అధికారి మురళీ

నాదెండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు వారు పండించిన పొగాకును అమ్ముకొనేందుకు ఆయా కంపెనీల నుంచి బాండ్లు తీసుకోవటం శ్రేయస్కరమని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ అన్నారు. మండలంలోని నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రాంగణంలో ఫ్యాక్ట్ కంపెనీ వారు రైతులకు మిరప తదితర పంటల సాగుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మురళీ మాట్లాడు తూ ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం ఊహించని విధంగా పెరిగిందన్నారు. పొగాకు కొనేందుకు కంపెనీలు ముందుకు రాకపోతే నష్టపోయే అవకాశం ఉందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ పాస్ఫేట్ లాంటి ఎరువులను ఎక్కువగా వాడటం వల్ల పూర్లకు తెగులు సోకుతుందన్నారు. మిరపలో బొబ్బర, నల్లి నివారణకు ఆమె పలు సూచనలు చేశారు. ఫ్యాక్ట్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ స్టాలిన్ ధనరాజ్ ప్రసంగించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రాఘవేంద్ర, హర్ష వర్ధన్, అధికారులు, ఏ హరిప్రసాదు, విశాల్, సొసైటీ మాజీ అధ్యక్షులు హరిబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలి

జొన్నలగడ్డ (నరసరావుపేట రూరల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళి తెలిపారు. జొన్నలగడ్డ గ్రామంలో పేరెంట్, టీచర్ ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యనందించడం జరుగుతుందని.. విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నల్లపాటి రామచంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.